యువత చుట్టూ రాజకీయం

సగానికి పైగా యువ ఓటర్లే
- 39 ఏళ్లలోపు 2.88 లక్షల ఓటర్లు



రాజేంద్రనగర్: నియోజకవర్గ పరిధిలోని యువ ఓటర్ల చుట్టూ.. ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రదక్షిణలు చేస్తున్నారు. యువకులను ప్రసన్నం చేసుకునేందుకు నానా రకాల తంటాలు పడుతున్నారు. ముఖ్యంగా బస్తీలు, కాలనీలు, అపార్ట్‌మెంట్ వారీగా విభజించి తమ పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. రోజూ ఆయా ప్రాంతాల్లో ముఖ్య నేతలతో పాటు ప్రధానంగా యువకులను టార్గెట్ చేసుకొని తమ పార్టీలలో చేరికలను ప్రోత్సాహిస్తున్నారు.

- నియోజకవర్గంలో మొత్తం 5,53,590 మంది ఓటర్లలో 40 ఏళ్లలోపు యువకులే 2,88,414 మంది నమోదై ఉన్నారు.
- గెలుపు, ఓటములను శాసించేది యువకులే కావడంతో ప్రస్తుతం రాజకీయమంతా యువకుల చుట్టే తిరుగుతుంది. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు, వారి అనుచరులు వీరిపైనే ప్రధానంగా దృష్టి సారించారు.

యువకుల చేరికలు..
- గత ఐదు రోజులుగా నియోజకవర్గంలో ప్రధాన పార్టీలు యువకుల చేరికలపై దృష్టి సారించారు. ప్రతి రోజు మండలాలు, వార్డులు, బస్తీల వారీగా చేరికలను నిర్వహిస్తున్నారు. ఇందులో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒకరికొకరు పోటీపడుతున్నారు.
- ఒక బస్తీలోని యువకులను బీజేపీ పార్టీలోకి చేర్చుకున్న వెంటనే, గంటల్లో అదే బస్తీలోని ఇతర యువకులను మరో పార్టీలోకి పోటీ పడి కండువాలు వేస్తున్నారు. దీంతో యువకులకు ప్రాముఖ్యత భారీగా పెరిగింది. నియోజకవర్గంలో యువకుల చేరికే అధికంగా ఉంటోంది.

హమీలు..
నియోజకవర్గంలోని యువకులను తమ పార్టీ వైపు ఆకర్షించేందుకు అన్ని పార్టీల నాయకులు తైలాలు ప్రకటిస్తున్నారు. బస్తీలు, కాలనీలు, అపార్ట్‌మెంట్‌ల వారీగా వారిని విభజిస్తూ.. తాము క్రీడాపరికరాలు, వ్యాయామ సామగ్రీ, టూర్‌లు తదితర ప్యాకేజీలను ప్రకటిస్తున్నారు. నేరుగా పార్టీలోకి చేరి ప్రచారంలో పాల్గొంటే వారికి అధిక ప్రాధాన్యత ఇస్తూ తైలాలను ప్రకటిస్తున్నారు.

సగానికి పైగా యువకులే..
రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో సగానికి పైగా ఓటర్లు 40 ఏళ్ల లోపు వారే ఉండటం గమనార్హం. 18–19 ఏళ్ల లోపు 10,850 మంది ఓటర్లు, 20–29 ఏళ్లలోపు 95,106 మందిఓటర్లు, 30–39 ఏళ్లలోపు 1,82,518 మంది ఓటర్లు ఉన్నారు. కాగా వీరిలో అత్యధికంగా 30–39 ఏళ్ల ఓటర్లు ఉన్నారు. వీరే ప్రధాన పార్టీల గెలుపు ఓటములను శాసించనున్నారు.
- యువ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. కొత్తగా 10,850 మంది ఓటర్లుగా నమోదు కావడం.. మొదటిసారి వీరంతా ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. వీరిని తమవైపు లాక్కునేందుకు అన్ని పార్టీల నాయకులు ఇప్పటికే ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

జంగ్ తెలంగాణ 2023

అభినందన



మహిళా రెజ్లర్లను అభినందిస్తున్న దృశ్యం

మణికొండ: హైదరాబాద్‌లోని దూల్‌పేట్ కేంద్రంగా జరిగిన రాష్ట్ర మహిళా రెజ్లింగ్ పోటీలలో నార్సింగికి చెందిన ముగ్గురు మహిళా రెజ్లర్‌లు పతకాలను సాధించారు. ఈ నెల 2 నుంచి 5 వరకు పోటీలు జరిగాయని, ఈ పోటీల్లో శివాని బంగారు పతకం సాధించగా, లచిత, దేవీప్రియలు వెండి పతకాలను సాధించడంతో వారిని కోచ్ శ్రీకాంత్‌యాదవ్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలను సాధించి సత్తా చాటాలని వారికి సూచించారు.

ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ 'ఐ రాస్తే'కు ప్రపంచగుర్తింపు

రాయదుర్గం: ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'ఐరాస్తే' ప్రాజెక్టుకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించింది. ఇటీవలే ఇంటర్నేషనల్ రోడ్ ఫెడరేషన్(ఐఆర్ఎఫ్) వార్షిక సంవత్సర పుస్తకం–2023లో ప్రచురించారు. గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని అప్లైడ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రీసెర్చ్ సెంటర్(ఐఎస్ఏఐ) ప్రాజెక్టుగా 'ఐరాస్తే' గుర్తింపు పొందింది.

బీఆర్ఎస్‌లోకి చేరికలు



లంకల నిఖిలసంగారెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ లంకల నిఖిల సంగారెడ్డి తన అనుచరులు 200 మందితో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేద ప్రజలకు అండగా సీఎం కేసీఆర్ సారథ్యంలో అద్భుతమైన పథకాలు అమలు చేస్తున్నారన్నారు. డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్, పార్టీ అధ్యక్షుడు గోకరి సురేష్‌గౌడ్, కార్పొరేటర్ సాగర్‌గౌడ్, సంతోషిరాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుగులేని శక్తిగా బీఆర్ఎస్..



గణేష్‌నగర్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్‌లో బీఆర్ఎస్ పార్టీ తిరుగులేని శక్తిగా మారుతుందని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. సోమవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ గణేష్‌నగర్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సంకూరి జయప్రకాష్ ఆధ్వర్యంలో ఇతర పార్టీల నుంచి భాస్కర్‌తో పాటు 150 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ,బీజేపీలలో అభ్యర్థులకు సరైన కార్యకర్తలు లేక సతమతమవుతున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏ గల్లీలో చూసిన కనబడుతారని వెల్లడించారు. రాజేంద్రనగర్ నుంచి భారీ మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. సంకూరి జయప్రకాష్, ప్రేమ్‌గౌడ్, రాఘవేందర్, భాస్కర్, కుమార్ తదితరులున్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

అత్తాపూర్: తెలంగాణ అభివృద్ధి, సంక్షేమానికి నిరంతరం కృషిచేస్తూ దేశంలోనే ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ రాష్ట్రాన్ని ముందుకు తీసుకొచ్చిన ఘనత ఉద్యమ నాయకుడు, సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని రంగారెడ్డి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మిద్దెల బ్రదర్స్ సురేశ్‌రెడ్డి, సురేందర్ రెడ్డిలు అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించే నాయకుడినే ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అత్తాపూర్‌లో ఇంటింట ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

ఎమ్మెల్యే అభివృద్ధి చేయలేదు



ప్రచారంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి

అత్తాపూర్: స్నేహశీలి యువనాయకుడు తోకల శ్రీనివాస్‌రెడ్డిని రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి బీజేపీ పార్టీ అభ్యర్థిగా గెలిపించుకోవాల్సిన అవసరముందని బీజేపీ సీనియర్ నాయకులు జోగి రవి అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని ఆశ పడినా.. సీఎం కేసీఆర్ రెండుసార్లు బాధ్యతలు చేపట్టినా ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. స్థానికంగా వంద పడకల ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్నట్లు ప్రకటించి ప్రకటనలకే పరిమితమైందని ఆరోపించారు. దుర్గానగర్ చౌరస్తాలో స్వర్గీయ దివంగత మాజీ హోంమంత్రి ఇంద్రారెడ్డి హిందూ స్టేడియంను మామా అనిపించుకున్నారన్నారు. కాటేదాన్ చౌరస్తాలో ప్రజల సౌకర్యార్థం ఫుట్ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన ప్పటికీ, అందుబాటులోకి తీసుకురాకపోవడం శోచనీయమన్నారు. గోవర్దన్, మల్లేష్, సుధాకర్, మల్లన్న, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

తోకల ఆధ్వర్యంలో చేరికలు..
రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ వడ్డెర సంఘం అధ్యక్షులు కొమెర గణేష్ రాజేంద్రనగర్ బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సారి రాజేంద్రనగర్ అసెంబ్లీ మొత్తం వడ్డెర కులస్తులు బీజేపీకి అనుకూలంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా తోకల మాట్లాడుతూ.. వడ్డెర సంఘం అభివృద్ధికి, వారికి జరుగుతున్న అన్యాయాలకు బీజేపీ ఎప్పుడు తోడుగా ఉంటుందన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు బాబురావు, గుంజ రాజు, కొమెర శంకర్, యాదగిరి, సాయికిరణ్, జగదీష్, రాజేశ్, శ్రీనివాస్, వేణు, మహేశ్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు



కస్తూరి నరేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన యువకులు

మణికొండ: పేదల సంక్షేమానికి కృషి చేసేది కాంగ్రెస్ పార్టీనేనని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కస్తూరి నరేందర్ అన్నారు. సోమవారం ఆయన నార్సింగి మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు క్యాతం అశోక్‌యాదవ్‌తో కలిసి బాలాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అందరికీ పింఛన్లు, ఇళ్ల స్థలాలు వచ్చాయని, తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అలాంటి పథకాలు సాధ్యమన్నారు. అధికారంలోకి రాగానే పార్టీ అధిష్టానం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలుచేసి ప్రజలకు మేలు చేస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆకాష్ ఆధ్వర్యంలో యువకులు కాంగ్రెస్‌లో చేరారు. కిరణ్, కిరణ్‌కుమార్, రాముల, వినోద్‌కుమార్, రాములతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం..



రాజేంద్రనగర్: అంబేద్కర్ బస్తీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సోమవారం పార్టీ సీనియర్ నాయకులు కోరని శ్యామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పథకాలను ప్రజలకు వివరిస్తూ.. చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. పెండ్యాల శ్రీధర్, లలిత్, కోరని మహేందర్ తదితరులున్నారు.

ప్రజలు మార్పును కోరుకుంటున్నారు.. !



మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్‌ను కలిసిన తోకల శ్రీనివాస్‌రెడ్డి

మణికొండ: నియోజకవర్గంలో ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తి ప్రజలకు ప్రత్యేకంగా చేసిందేమిలేదనే విషయాన్ని వారు గమనించారని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మణికొండ మున్సిపాలిటీలో పర్యటించి పార్టీ ముఖ్య నాయకుల నివాసాలకు వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు ఆనుకుని ఉన్న ఈ నియోజకవర్గం గ్రామ పంచాయతీ నుంచి గ్రేటర్ హైదరాబాద్ వరకు అనేక సమస్యలు ఉన్నాయన్నారు. నియోజకవర్గాన్ని పక్కా ప్రణాళికతో అభివృద్ధి చేసే ఎమ్మెల్యే ఉన్నప్పుడే అది సాధ్యమనే విషయం ప్రజలు గమనించారని, అందుకే ఈ ఎన్నికల్లో తనను గెలిపించేందుకు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. తన మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అభివృద్ధికి జీహెచ్ఎంసీలో పోరాడి నిధులను తెచ్చిన ఘనత తనకు ఉందని, భవిష్యత్తులో ఎమ్మెల్యేగా ప్రభుత్వం నుంచి నిధులను రాబట్టి రూపురేఖలను మార్చివేస్తానన్నారు. మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అంజన్‌కుమార్‌గౌడ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రొటోకాల్ ఇన్‌చార్జ్ పీసరి శ్రీనివాస్‌లను కలిశారు. తోకల శ్రీశైలంరెడ్డి, మణికొండ మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు బీరప్ప, నాయకులు సిద్ధప్ప, రవికాంత్‌రెడ్డి, రాజేష్ తదితరులున్నారు.

ప్రారంభమైన రోడ్డు పనులు



వన్‌మోర్‌నగర్‌లో మూసేసిన రోడ్డు

మణికొండ: ఏడాదిగా గుంతలు, డ్రైనేజీ పనులతో ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన రోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. మణికొండ మున్సిపాలిటీ నుంచి నెక్నాంపూర్ మీదుగా నార్సింగి, లంగర్‌హౌస్‌లకు వన్‌మోన్‌నగర్ కాలనీ మీదుగా ఉన్న రోడ్డు పనులను ప్రారంభించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం రోడ్డుపై బారికేడ్లను ఏర్పాటు చేసి రోడ్డుపై మట్టికుప్పలను పోసి మూసివేశారు. ఆ విషయం తెలియక సోమవారం అటుగా వెళ్లిన వారు ప్రత్యామ్నాయ రోడ్లను వెతుక్కునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వచ్చే నెలరోజుల్లో పనులను పూర్తి చేస్తామని అధికారులు పేర్కొన్నారు. వైఎస్ఆర్ కాలనీ, అలకాపూర్ టౌన్‌షిప్, అలిజాపూర్ రోడ్ల ద్వారా ప్రయాణించాలని వారు కోరారు.





కథక్ నృత్య ముద్రలను చూపుతున్న అర్పితా బెనర్జీ

కథక్ డ్యాన్స్ వర్క్‌షాప్

రాయదుర్గం: కథక్ నృత్య ప్రదర్శన విద్యార్థులు, అధ్యాపకులను విశేషంగా ఆకట్టుకుంది. గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయలో సోమవారం కథక్ డ్యాన్స్ వర్క్‌షాప్ నిర్వహించారు. రూట్స్ టు రూట్స్ ఇన్ సంస్థ ద్వారా ప్రఖ్యాత కథక్ కళాకారిణి అర్పితా బెనర్జీ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆమె విద్యార్థుల ముందు విభిన్న నృత్య ముద్రలను ప్రదర్శించింది. ఇందులోని ప్రాథమిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల కోసం మరిన్ని కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

టీపీజీఎల్ విజేత కె మోటార్స్–ఆర్య వారియర్స్



టీపీజీఎల్ విన్నర్స్, రన్నరప్

గోల్కొండ: శ్రీనిధి యూనివర్సిటీ 3వ తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ విజేతగా కె మోటార్స్–ఆర్య వారియర్స్ నిలిచారు. సోమవారం గోల్కొండ నయాఖిలాలోని హైదరాబాద్ గోల్ఫ్ కోర్సులో జరిగిన ఫైనల్స్‌లో ఆర్య వారియర్స్ జట్టు టీఎఫ్‌ను ఓడించింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఫైనల్స్‌లో ఒక్కొక్క అంచెలో ఒక్కొక్కరు పైచేయిని సాధించుకుంటూ ముందుకు సాగారు. 2, 3వ మ్యాచ్‌లు సమంగా ముగిశాయి. చివరికి అత్యుత్తమ గోల్ఫ్‌తో కె మోటార్స్ ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటూ ట్రోఫీని ఎగురేసుకుపోయింది. ఇంతటి ఉల్లాసభరితమైన వాతావరణంలో జరుగుతున్న బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం తనకు మరుపురాని అనుభూతులు ఇస్తాయని ప్రముఖ నటి మధుషాలిని అన్నారు. తెలంగాణ గోల్ఫ్ ప్రీమియర్ లీగ్‌కు ఆతిధ్యమివ్వడం తమకెంతో గర్వకారణమని హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు జయంత్ ఠాకూర్ అన్నారు. ఇటువంటి టోర్నమెంట్‌కు తాము స్పాన్సర్‌గా వ్యవహరించడం తమ సంస్థకే గర్వకారణమని ఎడ్యుకేషన్ గ్రూప్స్ చైర్మన్ డా. కటికనేని తాహెర్‌మహి అన్నారు. కాగా టోర్నమెంట్ నిర్వహణకు హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ వారు చక్కని సహకారం అందిస్తున్నారని ఆయన అన్నారు.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో బాలసాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత మాచిరాజు కామేశ్వర్‌రావుకు కథల చందమామ బిరుదును సోమవారం రవీంద్ర భారతిలో ప్రదానం చేశారు. జేపీ పబ్లికేషన్ ముద్రించిన దేశసేవ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ.. చిన్నారుల కోసం కామేశ్వర్‌రావు రాసిన పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడుతాయని కొనియాడారు.

ఏఐఎఫ్‌బీ అభ్యర్థి నామినేషన్ దాఖలు

అత్తాపూర్: ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం అభ్యర్థి రాములుయాదవ్ అత్తాపూర్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. మరో స్వతంత్ర అభ్యర్థి సైతం నామినేషన్ దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లయ్య తెలిపారు.

బీజేపీ లీగల్‌సెల్ కన్వీనర్ నియామకం



నియామక పత్రాన్ని అందుకుంటున్న ఎం.సుదర్శన్

రాజేంద్రనగర్: అసెంబ్లీ బీజేపీ లీగల్‌సెల్ కన్వీనర్‌గా ఎం.సుదర్శన్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్ పీతం ప్రదీప్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ప్రస్తుతం సురేందర్ రాజేంద్రనగర్ కోర్టులో సీనియర్ న్యాయవాదిగా ఉన్నారు. గతంలో రాజేంద్రనగర్ కోర్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. పేదలకు ఉచితంగా న్యాయ సేవలు అందించేవారు. గత 10 ఏళ్ల నుంచి లోక్ అధాలత్ మెంబర్‌గా కొనసాగుతున్నారు. గతంలో విద్యార్థి దశ నుంచి ఏబీవీపీలో పనిచేశారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ



మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు తమ వంతు చేయూతనందించేందుకు సేవా సంస్థలు ముందుకు రావాలని ధృవాన్ష్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ధీరజ్‌సింగ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు అమెజాన్ సంస్థ అందించిన స్కూల్ బ్యాగులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యకర్తల కృషితోనే విజయం సాధ్యం



శంషాబాద్: ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యకర్తలతోనే బీఆర్ఎస్‌కు విజయం సాధ్యమవుతుందని శంషాబాద్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సుష్మ అన్నారు. పట్టణంలోని ఆరో వార్డులో కౌన్సిలర్ వై.కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యే మరోసారి ఘన విజయం సాధించేందుకు కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్. గణేష్‌గుప్తా కౌన్సిలర్లు తదితరులున్నారు.

చిన్నారులను కళారంగాల్లో ప్రోత్సహించాలి

గన్‌ఫౌండ్రీ: విజయ మాధవి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ ఫెస్టివల్ వేడుకలను సోమవారం ఆదర్శనగర్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభినయ అంతర్జాతీయ సాంస్కృతిక వేదిక సంచాలకులు డాక్టర్ రాధామోహన్ మాట్లాడుతూ..నేటి తరం చిన్నారులను విద్యతో పాటు సాంస్కృతిక కళారంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు.

ఓటు హక్కుపై అవగాహన



ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని సద్వినియోగం చేసుకోవాలని నార్సింగి మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం అత్తాపూర్‌లో ఆయన ప్రజలకు ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తూ.. ర్యాలీ నిర్వహించారు. – అత్తాపూర్

విద్యార్థుల హాజరును యుడైస్‌లో సరిచేయాలి

అత్తాపూర్: నవంబర్ చివరి నాటికి రంగారెడ్డి జిల్లాలోని అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలలో హాజరులిస్టులోని విద్యార్థుల సంఖ్యను యుడైస్‌లోని సంఖ్యను సరిచేయాలని రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ విద్యా సెక్టోరల్ అధికారి నరేందర్, రాజేంద్రనగర్ మండల విద్యాధికారి రామిరెడ్డి అన్నారు. ఈ మేరకు సంబంధిత అంశాల మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పద్మశాలీపురంలోని ప్రభుత్వ పాఠశాలలో సమావేశాన్ని నిర్వహించుకున్నారు. పాఠశాలలో చదువుకుని వెళ్లిపోయిన విద్యార్థుల ఆధారాలను అధికారి సరిచేయాలన్నారు. యుడైస్ ప్లస్‌లోని విద్యార్థుల సంఖ్య ఆధారంగా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. టీసీలు తీసుకుని వెళ్లిపోయిన విద్యార్థులు డ్రాప్‌బాక్స్‌లో ఉండకుండా ఖాళీ చేయాలని తెలిపారు.

ఎమ్మెల్యే వైఫల్యంతోనే కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ !



సాతంరాయిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

శంషాబాద్: 'నియోజకవర్గంలో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి అభివృద్ధి చేయని ప్రకాష్‌గౌడ్ పనితీరే కాంగ్రెస్ పార్టీకి భారీ మెజార్టీ అందించడం ఖాయమని' పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ అన్నారు. పట్టణంలోని సాతంరాయిలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం విస్తృత ప్రచారం చేపట్టారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ సీనియర్ నాయకులు మైలారం సులోచన, శ్రీధర్‌యాదవ్, భాస్కర్‌రెడ్డి, అక్రమ్‌ఖాన్, పెద్దగండు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'ఐఎస్‌బీ' రోబోటిక్స్ స్టార్టప్‌కు చేయూత

ముందుకొచ్చిన మురుగప్ప గ్రూప్ సీడ్ ఫండ్

రాయదుర్గం: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) మెంటర్‌గా ఉండే రోబోటిక్స్ స్టార్టప్‌నకు చేయూత ఇచ్చేందుకు మురుగప్ప గ్రూప్ అనుబంధ సంస్థ నుంచి నిధులు కేటాయించనున్నారు. గచ్చిబౌలిలోని ఐఎస్‌బీలో వ్యవసాయ రోబోటిక్స్ స్టార్టప్ ఎక్స్‌మిషన్స్, కోరమండల్ ఇంటర్నేషనల్ నుంచి సీడ్ ఫండింగ్ అందించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఐ వెంచర్–ఐఎస్‌బీ డైరెక్టర్ సౌమ్యకుమార్ మాట్లాడుతూ ఎక్స్‌మిషన్స్ స్టార్టప్‌నకు సీడ్ ఫండింగ్ రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎక్స్‌మిషన్స్ వ్యవస్థాపకుడు, సీఈఓ తివిక్రమ్ కుమార్ డోగ్గా మాట్లాడుతూ వ్యవసాయంతో ఆటోమేషన్‌ను అనుసంధానం చేస్తున్నామన్నారు. ఇది నేటి, రేపటి రైతులకు సౌకర్యవంతంగా, లాభదాయకంగా ఉంటుందన్నారు.

ఎన్నికల నిబంధనలు.. సామాన్యులకు ఇబ్బందులు



ఎంఈఓ కార్యాలయానికి వెళ్లేందుకు అనుమతి ఇవ్వకపోవడంతో ఆగిపోయిన మహిళలు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) కార్యాలయం పరిసరాల్లో ఎన్నికల నిబంధనలతో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే సామాన్యులకు ఇబ్బందులు తప్పడం లేదు. శేరిలింగంపల్లి ఆర్ఓ కార్యాలయం వెస్ట్ జోనల్ కార్యాలయంలో ఉన్న విషయం తెలిసిందే. అదే భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో శేరిలింగంపల్లి సర్కిల్–20 కార్యాలయం ఉంది. ఆర్ఓ కార్యాలయం పక్కనే శేరిలింగంపల్లి తహసీల్దార్, ఎంఈఓ కార్యాలయాలు ఉన్నాయి. ఆర్ఓ కార్యాలయానికి వెళ్లే రోడ్డు నుంచే ఈ కార్యాలయాలకు వెళ్లాల్సి ఉంది. సర్కిల్ కార్యాలయానికి వచ్చే సామాన్యులకు మధ్యాహ్నం 3 గంటల వరకు అనుమతి లేదని 100 మీటర్ల బారికేడ్ల వద్ద నుంచే పోలీసులు తిరిగి పంపిస్తున్నారు. పలు అవసరాల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేందుకు అనుమతివ్వాలని కోరుతున్నారు.

సర్టిఫికెట్ కోర్సుల వార్షిక ఫలితాలు విడుదల

నాంపల్లి: తెలంగాణలోని 13 ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలోని అంశాలకు సంబంధించి డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల వార్షిక ఫలితాలను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు సోమవారం విడుదల చేశారు. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలల్లో జులై 2023 నెలలో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులకు పరీక్షలు నిర్వహించారు. పరీక్షల ఫలితాలను ఆయా కళాశాలలకు పంపించడం జరిగిందని వర్సిటీ పరీక్షల విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ నర్సింహమూర్తి ఒక ప్రకటనలో వెల్లడించారు.